రసప్లావితం


# ఆనందకానవం


## మల్లాది రామకృష్ణశాస్త్రి

బందరులో యిన్నూరేళ్ళనాడు ఓ కుమ్మరి కుటుంబం, ఇప్పటి గూడూరు వంతెనకు చేరువను, గూడూరు పోయే డొంక పక్కను ఉంటుండగా, ఆ ఇంట తొలుచూలు ఆడపిల్ల పుట్టింది. నూటొక్క తప్పెట కట్టుకుని "అమ్మోరి" ఊరేగింపు సాగి వస్తూ ఆ మొగదలకు వచ్చేసరికి అన్ని తప్పెటలు ఒక మొయిలి ఫెళ్ళుమనే సరికి, నీళ్ళాడే పొద్దుకైన ఆడ కూతురుకు సులువుగా పురుడొచ్చింది. పుట్టిన బిడ్డకు మూడు మాసాల దాకా కళ్ళు తెరిపిడి పడలేదు. అదన్నా ఎలా? ఆ ప్రాంతంలో బంగారయ్య అనే యోగి సంచారం చేస్తుండేవాడు. మనిషి మేలిమి చాయ. జడలు బంగారు తీగలు. ఎప్పుడూ నవ్వుకుంటూ ఉండేవాడు. అది నాట్యమో, నడకో తెలియదు. ఎప్పుడూ ముని వేళ్ళ మీద ఉండేవాడు. ఆ మనిషి ఒకనాడు ఉన్నట్టుండి ఈ బిడ్డను ఎగరేసుకు పోయినాడు. జనం ఏం మహత్తు పుట్టబోతుందోనని వెంటబడ్డారు. అలా పోయి పోయి వేణు గోపాల సన్నిధికి చేరుకుని గొంతున మురళి పలికిస్తూ చిందులు వేశాడు. పసి కందు ఝల్లున నవ్వి కళ్ళు తెరిచింది. ఆ బిడ్డకు నెలల నాడే దీవెన వచ్చింది. ఏళ్ళు తిరిగినవి. బిడ్డ నేవళాన ఎదిగింది. ఒత్తరి తనం వచ్చింది. ముంతెడు కొప్పు, వల్ల మాలిన వయ్యారం. తల్లి పైట వేయబోయింది. ఉహు! పావురాయి వాన చినుకులు విదిలించినట్టు విదిలించింది. ఈడొచ్చే సరికి మాట వచ్చింది. నీ పేరేంటమ్మా అంటే ఆనందం అని పక పకా నవ్వేది. ఎప్పుడూ వేణు గోపాల సన్నిధి లోనే ఉండేది. ఎల్ల వేళలా నాట్యం మీదే ఉండేది. ఏడాదికి ఆలయం ముందు, తిరునాల. ఓ తీర్థ ప్రజ. అలా మూడేళ్ళు జరుగ్గా, ఆలయానికి ప్రాకారం కట్టే ఉద్దేశం కొందరు సజ్జనులకు కలిగింది. ఆ బిడ్డ మరి ఆలయం చాయలకు రాలేదు. తాను పుట్టిన చోటుకు చేరుకుంది. ఒక్క ఏడాది నిలువెత్తు కృష్ణ విగ్రహం చేసుకున్నది. కొన్నాళకు ఆ పట్టు బృందావనం అయింది. కొన్నేళ్ళ పాటు అది యాత్రా స్థలం అయింది. తెలుగు సీమలో ఆనాడు పేరు మ్రోగే నాట్యసానులందరూ అక్కడ మూడు రాత్రులు సేవించుకునే మ్రొక్కుల మీద వచ్చే వారట. ఆ బిడ్డ చలువను ప్రతి ఒక్క ఆడకూతురు నేర్చిందట. ఆ చాయల తిరుగాడితే చాలు, నాట్యం అబ్బేదట. క్షేత్రయ్య ఆ వైభవం తిలకించాడట. అలా నాలుగేదులు గడిచినా, ఆ బిడ్డకు పదారేళ్ళ రమణీయకమేనట. ఉన్నట్టుండి ఓ నడి వేసవిలో ఓ పున్నమికి జల్లు కొట్టి, ముసురు కొట్టి, అది వాన కాదు, మన్నూ మన్నూ కలగలసి పోయిందట. ఎక్కడవారక్కడ దూసుకున్నారు. ఈ బిడ్డ స్వామి వారిని కౌగిలించుకు ఉందట. అది అందరూ చూసారు. ఎలాగైనా అక్కడ నుంచి పొడి చోటికి చేర్చాలని భయభక్తులతోనే పెనుగులాడారు. ఎవరి వల్లా కాక పోగా, వాన తాకిడికి నిలువ లేక స్వామి మీద భారం వేసి తలదాచుకున్నారు. వాన వెలిసింది. అంతా ఏకార్ణవం. స్వామి లేదు. ఆ బిడ్డా లేదు. మరి కనబడలేదు. కాని ఆ పుంతన పోయే గోవు అక్కడ ఆగి మోకరిల్లి ఆ పట్టున తలమోసి మ్రొక్కి గాని పోదు. ఈ కథ విననోచిన ధన్యులకు కలకాలం అందినంతమేరా బృందావనం.

ఇది పూజ్యశ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రి గారి ఆఖరి కథ

21—7—67



తెలుగుకథలోని అచ్చమైన
తెలుగు నుడికారానికి ఆకారం
మల్లాది రామకృష్ణశాస్త్రి.
ఈ తరానికి తెలియని
మొన్నటి తరానికి చెందిన
మల్లాది వారి అరుదైన
అందమైన చిన్నకథ